# నిరీక్షణ

అతను వచ్చేశాడా ?

చేస్తున్న పనంతా ఆపి పరిగెత్తుకుంటూ వచ్చాను.

అలలు అలలుగా గాలితోపాటు పాట !

ఎవరతను ? ఏమో !

ఎందుకలా ? ఏమో !

మొదటిసారి అతను అలావచ్చి....అదిగో ఆ రాయి మీదే కూర్చుని తన చేతిలోకి ఆ 'మురళి'ని తీసుకొని తన్మయత్వంతో తన ఊపిరినంతా గీతంగా మారుస్తున్నప్పుడు ఒకింత కుతూహలం మించి ఏమీ కలగలేదు. తిరిగి అదే మనిషి-సాయంకాలం.... సూర్యుడింక కనిపించక ఆకాశంలో రంగులు సౌందర్యంతో మెరిసిపోతుంటే, పిట్టలు బారులు బారులుగా రెక్కలూపుకుంటూ పయనిస్తున్నప్పుడు....

తన రెండు పెదవులూ 'పిల్లనగ్రోవి'కి ఆనించి....నాభినుండి వింటిని సంధించినట్లుగా.... కళ్ళు రెండూ మూసుకొని.... తన వ్రేళ్ళ కదలికల్తో ఏదో పాటకు రూపం అద్దుతున్నప్పుడు....

ఎవరీ మనిషి ?

యువకుడా ? నడివయస్కుడా ?

ఎవరైతేనేం ఓ భావుకుడు-

సాయం సమయాల్లో చౌరస్తాల్లో, కాఫీ హోటళ్ళలో, బార్లలో, ఆడపిల్లలమీద, వారి నడకలమీద వ్యాఖ్యానాలతో క్షణం తీరికలేని సమయాన-బాక్సాఫీసులు ఎలా బద్ధలయ్యాయో ఓ అవగాహన కుదరక ఘర్షించే సమూహాలనొదిలి.... బాదం హల్వా నొదిలి.... రవ్వ ఇడ్లీలను కాదని.... కప్పు కాఫీకి దూరమై....'గోల్డ్‌ఫ్లేక్' పెదవుల్ని కాల్చేసే క్షణాల్లో ఎవ్వారితడు....

అవని హృదయంపై వేలాడే ఆభరణమా....

నిరంతర తపోదీక్ష సమరంతో తనను తాను మరుస్తున్న మునా ?

ఇలా ఏటి చెంతకు వెదుక్కుంటూ వస్తాడు....

చీకటిపడుతుంది. వెన్నెల వెలుగులొస్తాయి. అతను అలా కూర్చుంటాడు. వేణువు మూగబోతుంది. అలసిపోతాడేమో.... అలా వాలిపోతాడు.

ఇసుక గుండెలమీద.

కాలం కరుగుతుంటుంది.

అతను కదలడు.... ఏం మనిషో.... అతనికేసి చూస్తూనే ఉండాలనిపిస్తుంది. అతను కదిలివెళ్తే బాగుంటుంది.... కదలడు.... తిరిగి పాట చెట్లు ఊగుతాయి.... కోకిల బదులు పలుకుతుంది. అతను పరవశిస్తాడు....

నేనేనా తనని గమనించటం... అతనికి ఈ ప్రపంచంతో పనిలేదా ? నన్ను గమనించడా ? అతని పాటకోసం నేను ఎదురు చూస్తాననే గర్వమా ? ఏమోగానీ...

ఎప్పటికో అతను మాయం అవుతాడు...

సాయంకాలం అయితే చాలు...

కళ్ళు అటుపరుగులుతీస్తాయి. అదేమిటో వరసగా నాలుగురోజులు వస్తాడు. తిరిగి మరలా కనిపించడు. అయినా గట్టుమీద నిలబడి చూస్తుంటే చెవులకేదో పాటని విన్నట్లే అనిపిస్తుంది.

పూలని మాలలుగా కడుతుంటే అవన్నీ అతని కంఠసీమను అలంకరిస్తే అనిపిస్తుంది.

అతను అలౌకికుడనిపించేది... నిజమే కావచ్చు... ఏటిలో తాను పాట అయినప్పుడు... తిరిగి జీవితంలోకి వెళ్తాడేమో !

ఆనందం పొంగినప్పుడు... విషాదం రగిలినప్పుడు అతను ఏటి నడుమకు కొట్టుకొస్తాడు.

తనకేం తెలుసు... తను సృష్టించిన సంచలనం... అడవిగాచిన బతుక్కి వెన్నెల అతని పాటని గుర్తిస్తే... అతనలా సాయం సమయాలూ, వెన్నెల రాత్రులూ తన సంగీతంతో నా మానసిక వేదనకు చికిత్స చేస్తూపోతే...

అలా నేఁవులూదుతూ ఊపిరిని మర్చిపోతాడా ? ఏమో మరి... ఎన్ని గంటలయింది... ఎన్నిరోజులయింది... ఏరు ఎండిపోయి ఎడారిలా కనిపిస్తున్నదే... అతనేనా తిరిగి వచ్చింది.

ఏమై పోయావ్ అజ్ఞాత నేస్తమా

నీ పాటకోసం ఈ చెవులు కాయలు కాచాయి.

నీ దర్శనం కోసం ఈ కళ్ళు తెరిచే ఉన్నాయి....రా... ఒక్కసారి రా నీ కోసం నేనిక్కడ నిలబడ్డా... హృదయమంతటితోనూ ఓ చిరు అభినందనను అందించటానికి... తెలుసు నేస్తం...

నువ్వు వస్తావ్ ఇది అడవి కాదు...ఇది ఎడారి కాదు...ఇది నగరం కాదు... ఇక్కడ ఎదురు కాల్పులు లేవు... ఇక్కడ మందు పాతరలు

లేవు. ఇక్కడ నినాదాలు లేవు... ఇక్కడ స్వార్థంలేదు... ఇక్కడ ద్వేషం లేదు... ఇదంతా మైదానం...

ఇసుక రేణువులు... నీటి గల గలలు... నీ కోసం ఏరు విడిచిన చిన్న గట్టు... ఇదిగో ఇక్కడ ఈ తోటకు కాచే మామిడి ఫలాల కోసం 'కాపలా' కాచే నేను... అడుగో ఆ మూల కండలు కరిగిస్తున్న నావాడు... అనుభూతించటం వస్తేచాలు... ఏరు అందరిదీ... అమ్ముకొందామని చూస్తే ఏరూ... కొందరిదే.

రా నేస్తం... రావయ్యా

గొంతునిండా కోకిలల్ని నింపుకున్నవాడా ?

జీవితాన్ని జీవించాలనుకుంటున్న వాడా ?

భ్రమల్ని, భ్రాంతుల్ని, వదులుకున్నవాడా ?

నువ్వు ఈ చోటులో కూర్చుని పాడుతున్న సమయాన నిన్ను చూసి, తరించి, తపించి కళ్ళనీళ్ళ పర్యంతమై, సంతోషించి, దుఃఖించి... ఒక్క ముక్కలో అన్ని రసానుభూతులూ నన్ను మమేకం చేస్తే... నువ్వు ఎవరైతేనేం... భక్తుడివో నాస్తికుడివో... అజ్ఞానివో... విజ్ఞానివో ఎవరైనాసరే... నిండుహృదయంతో ఆహ్వానిస్తున్నా...

రా బాబూ రా... రా తండ్రీ రా... మా కొంచెం ఆనందాన్ని పంచివెళ్ళు...

బాబూ....

నువ్వుసైతం ఈ లౌకిక ప్రజా తంత్రంలో పడి... జీవితపు రొచ్చు గుంటలోపడి, సవాలక్ష భయాల, దొంగ మర్యాదల బారినపడి నీకున్న ఆ ఒక్క హృదయాన్నీ కోల్పోకు...

జీవితం రాక్షసమైనదే... అది తనలోకి నిన్ను లాక్కుంటుందని తెలుసు...

అయినా నేస్తం...

ఆ విష కౌగిలి నుండి అప్పుడప్పుడూ బయటకువచ్చి నీ గానాన్ని అందించు.

మా నిరీక్షణ ఆగేంతవరకూ
నీ గొంతులో ఊపిరున్నంతవరకూ
పాడు బాబూ - పాడు తండ్రీ - పాడు నేస్తం!